కాలుష్య రహిత పరిశ్రమలు కావాలి

ప్రజాభిప్రాయ సేకరణలో సూచనలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సెజ్ లిమిటెడ్ ప్రతిపాదించిన బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు (ఎంపీఐపీ)కు సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనాలపై నాలుగు రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తీసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం తొండంగి మండలం, ఏవీ నగరం గ్రామం పరిధిలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ భవనం వద్ద పారిశ్రామిక పార్కుకు సంబంధించి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ డా. కృతికా శుక్లా సమక్షంలో కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎస్.అశోక్‌కుమార్ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. తొలుత కాకినాడ సెజ్ ప్రతినిధులు ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు వివరాలతో పాటు ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనాల నివేదికలోని అంశాలను వివరించారు. 4,072.63 ఎకరాల్లో మల్టీ ప్రాడక్ట్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకానుందని.. పార్కులో మౌలిక వసతుల అభివృద్ధి వ్యయం రూ. 2,500 కోట్లుగా అంచనా వేసినట్లు వెల్లడించారు. భూ సేకరణ, పునరావాసం, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిపాదిత పరిశ్రమలు, ఘన, ద్రవ వ్యార్థాల నిర్వహణ, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు, పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ), నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు తదితరాలకు సంబంధించిన అంశాలను వివరించారు. యు.కొత్తపల్లి మండలంలోని పొన్నాడ, రమణక్కపేట, శ్రీరామపురం, తొండంగి మండలంలోని ఏవీ నగరం, కె.పెరుమాళ్లపురం, కోదాడ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కొందరు కోరగా.. నిరుద్యోగ యువతకు వీలైనంత త్వరగా ఉపాధి కల్పించాలని కోరారు. బల్క్ డ్రగ్ పరిశ్రమ వ్యర్థాల నిర్వహణపై కొందరు సందేహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కృతికా శుక్లా మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2006, సెప్టెంబర్ 14న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కాకినాడ సెజ్ లిమిటెడ్-మల్టీ ప్రాడక్ట్ పారిశ్రామిక పార్కుపై పర్యావరణ ప్రభావ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 36 మంది నేరుగా తమ అభిప్రాయాలను తెలియజేశారని.. 60కి పైగా రాతపూర్వక అభిప్రాయాలు వచ్చాయని వెల్లడించారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎన్.అశోక్ కుమార్ మాట్లాడుతూ కాకినాడ సెజ్ లిమిటెడ్ ప్రతిపాదిత బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కుకు పర్యావరణ అనుమతులు తీసుకునే క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఆర్‌డీవో జె.సీతారామారావు, కాకినాడ సెజ్ డైరెక్టర్ ఒ.రామిరెడ్డి, కాకినాడ సెజ్ ప్రతినిధి (పర్యావరణం) ఎంఎన్‌కే శ్రీనివాస్, పర్యావరణ కన్సల్టెంట్ జీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో వినియోగంలోకి జనరేటర్

-విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న జనరేటర్ వినియోగంలోనికి వచ్చింది. గత నెల 18వ తేదీన నిరుపయోగంగా ఉన్న జనరేటర్, పట్టించుకోని అధికారులు అనే శీర్షికన విశాలాంధ్రలో వచ్చిన వార్తకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, అధికారులు స్పందించారు. సోమవారం జనరేటర్‌కు కనెక్షన్ ఇచ్చి ట్రైల్ వేశారు. దీంతో ఆస్పత్రిలో రోగులు పడే ఇబ్బందులు, ఆపరేషన్ సమయంలో వైద్యులు పడే ఇబ్బందులు తొలగనున్నాయి.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తరలింపునకు వ్యతిరేకంగా తెదేపా నిరసన

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక సర్కులర్ బజార్‌లోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తరలింపు వ్యవహారంపై గత కొద్దిరోజులుగా రగడ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం అమలాపురం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర టీడీపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే కౌంటర్ తరలింపు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఈ విషయంలో ఎంపీ చింతా అనురాధ, మంత్రి విశ్వరూప్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంప్ హౌస్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ వార్ఫ్ రోడ్డు పాత బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న పంపు హౌస్ నిర్మాణ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల మంగళవారం పరిశీలించారు. పనుల నిర్మాణ ప్రగతిని అక్కడే ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పంప్‌హౌస్ వల్ల భవిష్యత్తులో ముప్పు సమస్య ఎదురవ్వకుండా నివారించవచ్చునన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ప్రాజెక్ట్ వర్కులతో విద్యార్థుల్లో ఆలోచనాశక్తి పెంపు

విశాలాంధ్ర - మామిడికుదురు : విద్యార్థులు చేస్తున్న ప్రాజెక్టు వర్కుల ద్వారా వారిలో ఆలోచన శక్తి పెరుగుతుందని, వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకునేందుకు ప్రాజెక్టు వర్కులు దోహదపడతాయని మామిడికుదురు ఎంపీడీవో కే వెంకటేశ్వరరావు అన్నారు. మామిడికుదురు గ్రామానికి చెందిన నయినాల లితీష్ వర్దన్ రాజమండ్రి శ్రీ చైతన్య స్కూల్‌లో సివిల్స్ బ్యాచ్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల్లో స్కూల్ యాజమాన్యం ఇచ్చిన ప్రాజెక్టు వర్కును ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పోషక పదార్థాలు లోపించిన ఆహారం తీసుకోవడాన్ని పోషకాహార లోపం అంటారు. దీనికి ఉపవాసాలు చేయడం, అనారోగ్య పరిస్థితులు, పేదరికం, మూఢ నమ్మకాలు, అవగాహనా రాహిత్యం, సాంఘిక, ఆర్థిక కారణాలు, అపరిశుభ్రత ముఖ్యమైన కారణాలు. దీర్ఘకాలంగా పోషకాహారం లోపిస్తే పెరుగుతున్న పిల్లల్లో ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. వీరిలో జీవక్రియ రేటు అధికంగా ఉండి తగినంత కార్బోహైడ్రేట్లు, కొవ్వులు నిల్వ ఉండవు. పౌష్టికాహార లోపం పై విద్యార్థి లితీష్ వర్దన్ చేసిన ప్రాజెక్ట్ స్ఫూర్తిదాయకంగా ఉందని ఎంపిడివో కె. వెంకటేశ్వరరావు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి అని, తద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు నని పేర్కొన్నారు.

ప్రభుత్వ జీవోను అమలు చేయాలి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : హైస్కూల్ వాచ్మెన్ పోస్టులు భర్తీలో అదే స్కూల్లో ఆయాలుగా పని చేస్తున్న వారి భర్తలకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీవోను కాదని వైసిపి నాయకులు వాచ్మెన్ పోస్టులను అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

42 రోజులుగా మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన శశి చారిటబుల్ ఫౌండేషన్ చలివేంద్రంలో 42 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు దాతల సహకారంతో మజ్జిగను ఉదయం నుండి సాయంత్రం వరకు అందిస్తున్నారు. ఈ చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీతో ఎంతోమంది బాటసారుల దాహార్తి తీరుతుంది.

జిల్లా పంచాయతీ సర్పంచుల సంఘం అధ్యక్షురాలిగా శాంత కుమారి

విశాలాంధ్ర - అంబాజీపేట : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ సర్పంచుల సంఘం అధ్యక్షురాలుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి సుబ్బారావుని నియమిస్తూ సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు యలమంచిలి బాబు రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు మంగళవారం నియామక ఉత్తర్వులను శాంత కుమారి సుబ్బారావుకు అందజేశారు. ఈ నియామక పత్రాన్ని కాకినాడలో జరిగిన సర్పంచుల సమాఖ్య సదస్సులో అందుకున్న సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి సుబ్బారావు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆమె అన్నారు.

లారీ ఢీ కొని ఎద్దు మృతి

విశాలాంధ్ర - తాళ్లపూడి : లారీ ఢీకొని బండి బోల్తా పడి ఎద్దు మృతి చెందగా, మరో ఎద్దు గాయాలపాలైన సంఘటన తాళ్ళపూడి ఏటిగట్టు రూట్లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వైజాగ్ నుండి గోపవరం వెళ్తున్న బొగ్గు లోడ్ లారీ మంగళవారం తెల్లవారు ఝామున ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొంది. ఈ సంఘటనలో బండి యజమాని శ్రీనివాస్‌కు గాయాలై రాజమండ్రి ఆస్పత్రికి తరలించగా ఒక ఎద్దు చనిపోయింది. ఎద్దులు లక్ష రూపాయల విలువ చేస్తాయని, జీవనాధారం పోయిందని ఎడ్ల బండి యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్టేషన్ హెచ్.సి భగవాన్ దాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.11.65 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలకు ఆమోదం

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 సంవత్సరానికి రూ.11.65 కోట్లతో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలకు సంస్థ సభ్యులు ఆమోదం తెలిపారు. బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్డులోని జిల్లా గ్రంథాలయం సమావేశమందిరంలో తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దూలం పద్మ వెంకన్నబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి సమావేశంలో ఆమోదం పొందిన ప్రతిపాదనలను పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌కు పంపుతారు. సర్వసభ్య సమావేశం సందర్భంగా ఛైర్‌పర్సన్ పద్మ వెంకన్నబాబు మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల ఆధునీకీకరణ పనులు చేపట్టేందుకు వీలుగా బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చినట్లు వెల్లడించారు. ఆడియో విజువల్ సామగ్రి కొనుగోలుతో పాటు పుస్తకాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థుల్లో పుస్తక పఠనంపై అభిరుచిని పెంచేలా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఇందుకు అనుగుణంగా కొత్త పుస్తకాలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రాబోవు కాలంలో జిల్లా లోని అన్ని గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసి ప్రతి గ్రంథాలయంలోనూ కొత్తగా కంప్యూటర్లను సమకూర్చేం దుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్య దర్శి వివిఎన్ఎస్‌వి ప్రసాద్, వయోజన విద్య ఎపిఒ ఎం. వెంకటరెడ్డి, ఎఎంఒ రామిరెడ్డి జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఉప గ్రంథాలయాధికారి ఇన్‌చార్జి & సీనియర్ సహాయకులు ఎల్. వెంకటేశ్వర రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

స్కూలు ప్రారంభానికి ముందే జగనన్న విద్యా కానుక సిద్ధం

విశాలాంధ్ర - గోపాలపురం : పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కిట్లను అందించనున్నట్లు ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొరలు తెలిపారు. గోపాలపురం బీసీ గురుకుల పాఠశాలలో జేవీకే 4 స్టాక్ పాయింట్ నుండి ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొర, మండల విద్యాశాఖ అధికారి జి. శ్రీనివాసరావు జీవీకే4 స్టాక్ పాయింట్ ద్వారా మండలంలోని వివిధ స్కూళ్లకు జీవీకే కిట్లు సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామన్న దొర మాట్లాడుతూ స్కూళ్ల ప్రారంభం రోజునే జేవి కే 4 కిట్లు విద్యార్థులకు అందరికీ అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వారం రోజుల్లో పాఠశాలలు పున ప్రారంభం కానున్నాయని, దానికంటే ముందుగానే జేవీకే కిట్లు ఆయా పాఠశాలలకు చేరనున్నాయని అన్నారు. స్కూల్ తెరిచిన రోజుని వాటిని విద్యార్థులకు అందజేయనున్నామని కొయ్యలగూడెం డివిజన్ పరిధిలో పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారి చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఎఫ్ఎంసి కంపెనీ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 137 సంవత్సరాలుగా రైతులకు సేవలు అందిస్తున్న ప్రపంచ శ్రేణి అగ్రగామి, అయిన పురుగుల మందుల ఎఫ్ఎంసి కంపెనీ వారు రైతులకు పురుగుమందుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువలు గురించి సవివివరంగా అవగాహన కల్పించారు. ఆల్ ఇడియా ప్రెసిడెంట్ రవి అన్నవారపు, కమర్షియల్ డైరెక్టర్ రత్నాకర్, డీజీఎం గోపీనాథ్, డీజీఎం ప్రవీణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జగ్గంపేట ఏడి గంగాధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సద్గురు మూర్తి, గండేపల్లి మండల పరిషత్ అధ్యక్షులు దొరబాబు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పురుగు మందులు వాడకానికి తీసుకోవలసిన జాగ్రత్తలు సంబంధించిన పరికరాలను రైతులకు అందచేసారు. అనంతరం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ ఆర్థిక పరిపుష్టే లక్ష్యం

విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గంలోని ప్రతి కుటుంబ ఆర్థిక పరిపుష్టే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తూర్పుగోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, నియో జక వర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురం గ్రామంలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి పర్యటించి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా విధానాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల అమలులో భాగంగా పేదలు,రైతులు,మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్న దన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద,ఎంపీపీ మందారపు సితారత్నం వీర్రాజు, జడ్పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న, నాయకులు గండి నాని బాబు,పబ్బన శ్రీనివాస్, ప్రగడ రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల హక్కుల కోసం ఐక్య పోరాటాలు

పార్టీలకతీతంగా కలిసి రావాలని పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - కాకినాడ : గ్రామ స్వరాజ్యం కొరకు ఏర్పాటైన గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచుల హక్కులను హరిస్తున్న ప్రస్తుత ప్రభుత్వంలో తమ హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ పిలుపునిచ్చింది. గ్రామాల్లో సర్పంచులు గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో వెనకబాటు పట్టారని అందుకే తాము తప్పని పరిస్థితుల్లో హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేస్తున్నట్లు వారు చెప్పారు. మంగళవారం కాకినాడలోని సత్కలవాహిని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా రాష్ట్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైబి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12,900 పంచాయతీలకు ఆర్థిక సంఘం 2021 నిధులను విడుదల చేసినా అవి ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి మళ్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో కలిపి 2021-22 సంవత్సరానికి 8860 కోట్ల రూపాయలు పంచాయతీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం చోరీ చేసిందంటూ పంచాయతీ ఛాంబర్ తరపున కేసు నమోదు చేశామని త్వరలోనే కోర్టు దీనిపై తీర్పు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ మాట్లాడుతూ సర్పంచుల ఆధ్వర్యంలోకి సచివాలయాలను, వాలంటీర్లను తీసుకొని రావాలని, సచివాలయం కన్వీనర్ల రాజకీయ పార్టీ కన్వీనర్ల వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం నాయకులు నాగాబత్తుల శాంతి కుమారి, కాకర శ్రీనివాస్, బొబ్బ ప్రభాత్ కుమార్, సలాది బుచ్చిరాజు, రంబాల రమేష్, గుడాల రాంబాబు, వారా జయ సావిత్రి, బూసి జయలక్ష్మి, వేజర్ల ప్రమోద్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మట్టి ట్రాక్టర్లకు ముగ్గురి బలి

-ఇరువురికి తీవ్ర గాయాలు
-చోద్యం చూస్తున్న రవాణా
-మామూళ్ల మత్తులో పోలీసులు, రెవిన్యూ అధికారులు

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు పెచ్చరిల్లి పోతున్నాయి. అక్రమ మట్టితవ్వకాలు చేసే ట్రాక్టర్లు రేయింబవళ్ళు జనావాసాల మధ్య తిరుగుతూ ప్రజల ప్రాణాలు హరిస్తున్నాయి. వరసగా జరిగిన ఐదు సంఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మిగిలిన వారు హాస్పిటల్‌లో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. 15 రోజుల క్రితం పట్టణంలోని మహిపాల వీధిలో ఒక బాలిక మట్టి ట్రాక్టర్లు దారుణానికి బాలికగా నాలుగు రోజుల క్రితం రూరల్ మండలం నడిపూడి వద్ద పెనుమాల శాంతి అనే బాలిక మట్టి ట్రాక్టర్‌కి బలి అయ్యింది. మట్టి ట్రాక్టర్లు చేస్తున్న అరాచకాలకు కోనసీమ ప్రజలు ప్రాణ భయంతో వణికిపోతున్నారు. మట్టి ట్రాక్టర్లు కట్టడి చేయాల్సిన అధికారులు కొందరికి మామూళ్ళ బేరం సాగుతుంటే, మరికొందరికి రాజకీయ వత్తిళ్లు ఎక్కువగా వున్నాయని ఆందోళన చెందుతున్నారు. మట్టి తోలాకలకు అనుమతులు లేకున్నా మండల స్థాయి కొందరు పోలీసులు, రెవిన్యూ అధికారుల్ని మామూళ్ళతో కట్టేస్తే అక్రమ మట్టి తవ్వకాలు ఎలా తవ్వుకున్నా అడిగేవాడు ఉండదని మట్టి మాఫియా బరితెగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిని బలికొన్న మట్టి ట్రాక్టర్ల పై అధికారులు తీసుకున్న చర్యలు నేటికీ కానరావడం లేదు. జిల్లా డివిజన్ స్థాయి పరిధిలో పట్టించుకోవలసిన అధికారులు మట్టి ట్రాక్టర్లు ఆ వైపు కన్నెత్తి చూడటానికి జంకుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాట్రేనికోన మండలం దొంతికుర్రులో మట్టి ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన క్షత గాత్రుడు బొక్కా సాయి అమలాపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఇటీవల జరిగిన రెండు వరస సంఘటనల్లో ఇద్దరు బాలికలు మట్టి ట్రాక్టర్లుకి బలయ్యారు ఇలా రోజు ఎక్కడో ఒకచోట మట్టి ట్రాక్టర్లు జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ వారిని హరిస్తున్నాయి. దీనితో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు రాజకీయ నాయకుల పైరవీలు పక్కన పెట్టి మట్టి ట్రాక్టర్లు దురాగతల్ని కట్టడి చేయకుంటే ప్రజలతో ప్రత్యక్ష ఆందోళనకు రోడ్డు ఎక్కుతామని హెచ్చరిస్తున్నారు.

నిధులకు నిబంధనలు పెట్టండి

విశాలాంధ్ర - జగ్గంపేట : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి ఇచ్చిన 12 వేల కోట్లను జగన్ ప్రభుత్వం సక్రమంగా ఖర్చు చేస్తుందన్న నమ్మకం నాకు లేదని, నిధులు దారి మళ్లించకుండా నిబంధనలు పెట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేందుకు కేంద్రం ఇచ్చిన నిధులను ప్రక్కదారి మళ్ళించకుండా రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా ఉపయోగించాలన్నారు. కేంద్రం ఇచ్చే పంచాయతీ నిధులను సైతం దారి మళ్లిస్తున్నారాన్నారు. అదే తరహాలో వీటినీ మళ్ళిస్తారన్నారు. కేంద్రం నిబంధన పెట్టి, బహుళార్థక పోలవరం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలన్నారు. లేకుంటే ప్రజా ఉద్యమానికి సిద్ధం అవ్వాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు అప్పల రాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

స్థానిక రైతుల పేరుతో నాయకుల దోపిడీ
చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - సీతానగరం : దోచేయ్ దాచెయ్ అనే విధంగా మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మండలంలో నూతన పంచాయతీగా ఏర్పడిన చీపురుపల్లి గ్రామ పరిధిలో గత వారం రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా చవాకులు వారి చెరువు సర్వే నెంబర్ 18లో 21 ఎకరాల 77 సెంట్లలో విస్తరించి ఉన్న చెరువుని పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకొని ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే స్థానిక రైతులు పొలాలను మేక చేయడానికి ఉపయోగిస్తున్నామంటూ కథలు చెబుతున్నారు. కానీ జరిగేది సీతానగరం మండలంలో గల స్థానిక గ్రామాలైన సీతానగరం, చిన్నకొండేపూడి, రఘుదేవపురం గ్రామాలకు ట్రాక్టర్లు ద్వారా తరలిస్తూ 1000 నుండి 1600 రూపాయలకు మట్టిని అమ్ముకుంటూ లే అవుట్లను మెరక చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు మాకు ఏమి తెలియదు మా పరిధి కాదు అని అంటున్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండగా మట్టి, ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాల పై పోరాటాలు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇంత జరుగుతున్నా నాయకులు సైతం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత దర్జాగా మాఫియా సాగుతుందంటే అధికారులకు మాఫియా మామూళ్ళు చెల్లించడం వల్లే అక్రమ తవ్వకాలను ఆపడంలేదని ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజలు ఆరోపణలు చేస్తు న్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు వివరణ కోరగా సీతానగరం మండలంలో చెరువులు తవ్వకాలు ఎటువంటి అనుమతులు లేవు అని తెలిపారు. తహశీల్దార్‌ను వివరణ కోరగా చెరువుల తవ్వకాలు తమ పరిధి కాదన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర - కొత్తపేట : వృద్ధుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట గ్రామంలో బాబా నగర్‌కు చెందిన మెట్టి ధర్మయ్య(70) గత నెల 30వ తేదీ నుండి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. గతంలో ఇదే వృద్ధుడు పలుసార్లు ఇంటి నుండి వెళ్లినప్పటికి రెండు, మూడు రోజుల్లో తిరిగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ఈసారి వెళ్లిన ధర్మయ్య రాకపోయేసరికి వృద్ధుడి భార్య మంగాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన పై అదనపు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వివరాలు తెలిస్తే రావులపాలెం సిఐ ఆఫ్ పోలీస్ 9440796527, కొత్తపేట ఎస్ఐ ఆఫ్ పోలీస్ 9440904842 నెంబర్‌కు సమాచారం తెలియపరచవలసినదిగా ఆమె కోరారు.

నాణ్యత ప్రమాణాలతో నాడు- నేడు పనులు

విశాలాంధ్ర - శంఖవరం : నాణ్యత ప్రమాణాలతో నాడు నేడు ఫేజ్ టు పనులు జరుగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ తెలిపారు. మంగళవారం శంఖవరం మండలంలోని మండపం జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగు తున్న పనులను మండపం సచివా లయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లలితతో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న వంటసాల బాత్రూం, వాటర్ ట్యాంక్, విద్యుత్ పనులు పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పాఠశాలకు 42 లక్షల నిధులు అదనపు తరగతి గదుల కోసం రూ. 25 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామాలలో కూడా పనులు వేగంగా జరుగు తున్నాయని ఆయన తెలిపారు.

గ్రంథాలయాలు జ్ఞాన సంపదకు నిలయాలు

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రంథాలయాలు జ్ఞాన సంపదకు నిలయాలని, విద్యార్థులు వేసవిలో సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు విజ్జు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం 30వ రోజు కార్యక్రమంలో స్థానిక విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయంలో చదరంగం పోటీలు నిర్వహించారు. స్టూడెంట్స్ ఈ పోటీలలో ఎత్తుకు పై ఎత్తు వేసి తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ఈ ఈ సందర్భంగా గ్రంథపాలకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూన్ 11వ తేదీ వరకు నిర్వహించబడతాయని, అందరూ పాల్గొనాలని తెలియజేసారు. సెల్ ఫోన్లకు సమయం కేటాయించకుండా పుస్తక పఠనం వైపు దృష్టి కేంద్రీకరిస్తే విజ్ఞానవంతులు అవుతారని సత్యనారాయణ తెలిపారు.

ఉండ్రాజవరం ఎంపీడీవోగా రాజు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జివిఎస్ఆర్‌కె రాజు మంగళ వారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నరసాపురంలో పరిపాలనా అధికారిగా పనిచేసిన రాజు, ఉద్యోగ ఉన్నతిపై ఉండ్రాజవరం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ, సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బృందం, మండల యుటిఎఫ్ నాయకులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పుష్పగుచ్ఛాలిచ్చి ఆయనకు స్వాగతం పలికారు.

చిన్నారికి వైద్య చికిత్సకు సీఎం జగన్ హామీ



విశాలాంధ్ర-కొవ్వూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలన నిమిత్తం వచ్చిన సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు మండలం ఔరంగబాద్ గ్రామానికి చెందిన పాక నాగ వెంకట అపర్ణ తన ఏడు నెలల కుమార్తె నిస్సి ఆరాధ్య కిడ్నీ సంబంధిత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలిపి ఆదుకోవాలని అర్జీని అందచేశారు. బేబీ నిస్సి అనారోగ్య పరిస్థితి తెలుసుకుని చలించి పోయిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి తక్షణ ఆర్థిక సహాయం అందించి, తగిన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంలో ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని సిఎం భరోసా నిచ్చారు.

కౌలు రైతు మృతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం యండమూరు గ్రామంలో కౌలు రైతు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వనుం త్రిమూర్తులు గత నెల 24వ తేదీన చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడని ఆ గ్రామ సొసైటీ అధ్యక్షులు వనుం రమేష్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్షులు రాజశేఖర్ కార్యదర్శి రాజబాబు యండమూరి గ్రామం చేరుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వనం త్రిమూర్తులు భార్య లక్ష్మిని వివరాలు కోరగా గత 20 సంవత్సరాలుగా తన భర్త వ్యవసాయం ఆధారం చేసుకుని బ్రతుకుతున్నామని ప్రకృతి వైపరీత్యాలు పురుగుమందులు ఎరువులు ధరలు పెరిగి వ్యవసాయంలో అప్పులు పేరుకుపోయి వాటిని తీర్చే స్తోమత లేక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్షులు రాజశేఖర్ దీనిపై కలెక్టర్కు నివేదిక సమర్పించి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని లక్ష్మికి హామీ ఇచ్చారు.

జనసేన ఆధ్వర్యంలో త్రాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామ ప్రజలు మంగళవారం త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరును ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కాకర్ల వెంకట నరేష్, ఉపాధ్యక్షులు నరాల సాయి, కందులపాటి చందు, కార్యదర్శిలు వినుకొండ ప్రసాద్,లంకలపల్లి సురేష్, గ్రామ జనసేన పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఆకివీడు : పశ్చిమ, కృష్ణ జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల పది నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామచంద్రరావు తెలిపారు. మంగళవారం ఆకివీడు ప్రీమియర్ లీగ్ పేరుతో టిడిపి పార్టీ 12వ వార్డు ఇంచార్జ్ దుబా సురేష్ ఆర్గనైజేషన్లో నిర్వహించబడుతున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే రామరాజు, ఆకివీడు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూయువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పశ్చిమ, కృష్ణాజిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్లో జట్లు తమ ప్రతిభ చూపాలనిఅన్నారు. ఆర్గనైజర్ సురేష్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ. 20వేలు, రెండవ బహుమతి రూ. 15వేలు, మూడవ బహుమతి రూ. 10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మోటుపల్లి సత్యనారాయణ, ఉండి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు హరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల రీ సర్వే ప్రారంభం

విశాలాంధ్ర-పోడూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ భూముల రీ సర్వే కార్యక్రమం పోడూరు మండలం పెనుమదం వద్ద పోడూరు జడ్పిటిసి గుంటూరు పెద్దిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రీ సర్వే ఏర్పాటు చేశారన్నారు. రీ సర్వేలో రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవచ్చునన్నారు. రీ సర్వే వలన రైతులకు మేలు జరుగుతుందని జడ్పీటీసీ పేర్కొన్నారు.ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ తహసిల్దార్ అర్ వి కృష్ణారావు అర్ ఐ కే రాంబాబు సర్వేయర్ కే సత్యనారాయణ సచివాలయ సర్వేయర్ చిరంజీవి వీఆర్వోలు, మెహర్ బాబా శ్రీనివాసరావు డ్రోన్ ఆపరేటింగ్ సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, 2ఎకరాల భూమి ఇప్పించండి

- ప్రజా సంఘాల వినతి

విశాలాంధ్ర-చాట్రాయి: పోలీస్ శాఖ నిర్లక్ష్య వైఖరి వలన పంచాయతీలో దాడికి గురై అవమానభారంతో ఆత్మహత్య చేసుకున్న కలవల శ్రీను కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 2ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు చాట్రాయి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. సోమవారం చాట్రాయి తహసీల్దారు విశ్వనాథరావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చాట్రాయి మండల చరిత్రలో పంచాయతీలలో దాడులు చేస్తే అవమాన భారంతో ఆత్మ హత్య చేసుకున్న సందర్భం లేదన్నారు.50 సంవత్సరాలుగా అనుభవం ఉన్న వాళ్లు పంచాయతీలు చేసినవాళ్ళ దగ్గర కూడా ఇటువంటి దారుణం జరగలేదన్నారు. ఇతర మండలాల నుంచి తీర్పు ఇవ్వడానికి వచ్చిన వాళ్ళు నీకేం పర్వాలేదు మేమున్నాం మాట్లాడదాం భయపడకుండా పంచాయతీకి రమ్మని కలవాలి శ్రీనుని రప్పించినవాళ్ళు మూకుమ్మడిగా దాడి జరుగుతుంటే చేష్టలుడిగి చూసినట్లు తమకు తెలిసిందన్నారు.అటువంటి వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం సచివాలయ పరిధిలోనే ప్రత్యేక పోలీసు ను ఏర్పాటు చేస్తే గ్రామంలో శాంతి భద్రతలు గురించి స్టేషన్ కు తెలియకుండా ఎలా వుందన్నారు. అనంతరం నూజివీడు రూరల్ సిఐ అంకబాబు కు పోలీసు స్టేషన్ లో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమ్ము ఆనంద్ కెవిపిఎస్ నాయకులు కొమ్ము చంటి తదితరులు పాల్గొన్నారు.

చాంబర్స్ డిగ్రీ , పీజీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర - పాలకొల్లు: స్థానిక బిఆర్ అండ్ జికేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఎ.బి.ఎస్ మూర్తి మాజీ వై.ఎన్ కళాశాల ప్రిన్సిపల్, నేషనల్ సైన్స్ అకాడమీ మెంబర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు కళాశాల ప్రిన్సిపల్ డా. డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డా. ఎ.బీ.ఎస్ మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత నేటి యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు వ్యక్తిగత బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టడం వల్ల భవిష్యత్తు సుందరంగా ఉండగలదని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పించుటకు ఎకో క్లబ్బులు లాంటివి నెలకొల్పి విద్యార్థుల ద్వారా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ఇంకుడు గుంటలు తవ్వించడం లాంటివి చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

విశాలాంధ్ర-టీ నరసాపురం: వైసీపీ ప్రభుత్వం పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు విమర్శించారు. మహానాడులో ప్రకటించిన టిడిపి మేనిపేస్టోకు మద్దతుగా తిరుమల దేవిపేట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారా యణ ఆధ్వర్యంలో మహిళలు చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ

రైతే దేశానికి వెన్నెముక అన్నారు. రైతులకు డ్రిప్, స్పింక్లర్ల లు ఇవ్వడం లేదన్నారు. మహానాడులో చంద్ర బాబు ప్రకటించిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేశారని, కొంతమంది కి డబ్బులు వేసినట్లు వేసి పెంచిన ధరలతో మళ్లీ లాగేస్తున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసిరెడ్డి మోహన్ రావు ,సందేపూడి ప్రభాకర్ సాయి, కలిశెట్టి పార్ధసారధి, గండబోయిన శ్రీను, కాల్నీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాళం హేమంత్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - గండేపల్లి : కీ.శే. నాళం హేమంత్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను అతని స్నేహితులు, గండేపల్లి క్రికెట్ యువకులు గత నెల 21వ తేదీన జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ జిల్లా స్థాయి మెగా టోర్నమెంట్‌లో జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 32 టీంలు పాల్గొన్నాయి. వీరిలో దివాన్ చెరువు జట్టు మొదటి స్థానం సాధించగా, జగ్గంపేట జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఏలేశ్వరం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. వీరికి తహశీల్దారు కెవివి సత్యనారాయణ షీల్డ్‌లను, నగదు బహుమతిని అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 22,222, రెండవ బహుమతిగా రూ.11,111, మూడో బహుమతిగా రూ. 5,555 అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అంటే గొప్ప విషయమన్నారు. టోర్నమెంట్ పెట్టిన యువకులను అభినందించారు.

పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఎఫ్ఎంసి కంపెనీ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 137 సంవత్సరాలుగా రైతులకు సేవలు అందిస్తున్న ప్రపంచ శ్రేణి అగ్రగామి అయిన పురుగుల మందుల ఎఫ్ఎంసి కంపెనీ వారు రైతులకు పురుగుమందుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువలు గురించి సవివివరంగా అవగాహన కల్పించారు. ఆల్ ఇడియా ప్రెసిడెంట్ రవి అన్నవారపు, కమర్షియల్ డైరెక్టర్ రత్నాకర్, డీజీఎం గోపీనాథ్, డీజీఎం ప్రవీణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జగ్గంపేట ఏడి గంగాధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సద్గురుమూర్తి, గండేపల్లి మండల పరిషత్ అధ్యక్షులు దొరబాబు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పురుగు మందులు వాడకానికి తీసుకోవలసిన జాగ్రత్తలు సంబంధించిన పరికరాలను రైతులకు అందచేసారు. అనంతరం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వాకా దివ్యశేఖర్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐఐడి బాంబే ద్వారా పీహెచ్డీ పట్టాను పొందిన దివ్య శేఖర్ ను మంగళవారం అంగరలోని శ్రీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు గ్రామానికి చెందిన విద్యావేత్తలు ఘనంగా సత్కరించారు. ఇసింధటిక్ అపర్చుర్ రాడాల్ శాటిలైట్ చిత్రాలు ఉపయోగించి భూమి కదలికలపై పరిశోధనచేసిన మండలంలోని అంగరకు చెందిన యువకుడు వాక దివ్య శేఖర్‌ను పలువురు ప్రజా ప్రతినిధులు ప్రశంసించారు. ఎంపీడీవో ఎం రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అద్దాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, దివ్య శేఖర్ కృషిని అభినందించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రతిభ కనపర్చడం నేటి యువతకు ఆదర్శమన్నారు. దివ్య శేఖర్ తల్లిదండ్రులు వాకా పరమేశ్వరరావు, కృష్ణకుమారి దంపతులను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పివి రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో జాబ్ మేళా

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రెండవ మెగా జాబ్ మేళా శ్రీ కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యా సంస్థ ల ప్రాంగణం లో 7వ తేదీ బుధవారం వికాస వారి సౌజన్యం తో జరగనుంది. తాళ్ళపూడి చుట్టూ ప్రక్కల మండలాల నిరుద్యోగులు అందరూ ఈ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సంస్థ గౌరవ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు, కరిబండి కళాశాల డైరెక్టర్ త్రినాథ స్వామి, వికాస మేనేజర్ సత్యనారాయణ పేర్కొన్నారు. దీనికి సంబంధించి మంగళవారం కళాశాలలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించుకున్నారు.

కళాశాల విద్యార్థులను వలంటీర్లుగా సిద్ధం చేస్తూ వారికి కొన్ని సూచనలు చేశారు. వికాస మేనేజర్ సత్యనారాయణ, తాళ్ళపూడి మండల మానవత అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు గుప్తా, కరిబండి డిగ్రీ కళాశాల బోధనా సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో 21 కంపెనీలు, 900 కు పైగా ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా బిజెపి విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - బిక్కవోలు : బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో బిజెపి కన్వీనర్ శివ కృష్ణంరాజు ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిపించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి కృష్ణ భగవాన్ హాజరయ్యారు. ప్రధాని మోడీ ఆశయాలను ప్రతి ఒక్కరు సాధించేలా పనిచేయాలని కృష్ణ భగవాన్ కోరారు. బిజెపి సీనియర్ నేతలను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోటకూర వెంకటేశ్వరరావు, శివాజీ,కాకినాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - కాకినాడ : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రస్తుత కాలంలో రోజురోజుకి పెరుగుతున్న కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటవలసిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు అల్లై కిరణ్ కుమార్ అధ్యక్షతన పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా డిస్ట్రిక్ వైస్ గవర్నర్ అల్లై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులందరూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అల్లై పెంకె గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వెండి వింజామరుల అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో గల జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్య ధ్యాన మందిరం కు దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన అఖిలభారత విష్ణు సహస్రనామ ఫెడరేషన్ డైరెక్టర్ దేవరపల్లి మండల మానవతా సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ వెండి వింజరామాలను అందజేశారు శంకరాచార్య ధ్యాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తోట సత్యనారాయణకు అందజేశారు ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఉపనిషత్తులు వాటి సారాంశాన్ని విపులంగా వివరిస్తున్నారని జగద్గురు ఆదిశంకరాచార్యులు ను స్ఫూర్తిగా తీసుకొని ధ్యాన మందిరము కు వెండి వింజరామాలు అందిస్తున్నట్లు తెలిపారు ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ చైర్మన్ చలంచర్ల వీర వెంకటరనాథ్ ఉపాధ్యక్షులు నారాయణ విశ్వేశ్వరరావు కార్యదర్శి చిరపూరు సత్యనారాయణ గౌరవ సలహాదారు విష్ణుభట్ల రామారావు ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులను అభినందించారు ఈ కార్యక్రమంలో బలుసు రామకృష్ణ మహంత్ పాల్గొన్నారు అంతకుముందు ఓకే పానిపట్టంపై గల వినాయకుడు ఆదిశంకరాచార్యులు మహాలక్ష్మి జ్ఞాన సరస్వతి లకు ప్రత్యేక పూజలు హారతులు నిర్వహించారు

స్వయంగా భక్తులతో ద్రవ్యాభిషేకం



విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ మహెూత్సవం లో భాగంగా నేడు (బుధవారం) భక్తులు ప్రతిష్టా విగ్రహాలు, ధ్వజస్తంభముకు భక్తులు స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అభిషేకం చేసుకునే భక్తులు ఉదయం తొమ్మిది గంటల నుండి ఆవు పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు నీళ్లు, ఏదైనా నది జలం లేదా గంగాజలం తో స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని తెలిపారు.

అందుబాటులోకి రానున్న ఈ -ఆటోలు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలను రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం ప్రారంభించనున్నారని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రంలో ఇంటింటి చెత్తను తడి, పొడి చెత్తగా వేరుగా సేకరించటానికి 516 ఈ-ఆటోలను ప్రభుత్వం అందించిందని, ఈ-ఆటోలను సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. శుక్రవారం నుండి ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా మెరుగైన ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయడానికి అవకాశం కలుతుందని తెలిపారు. ఇప్పటికే ప్రజారోగ్య కార్మికులకు దశల వారిగా ఆటోల డ్రైవింగ్ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ-ఆటోల ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణకు స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ, సీడీఎంఏ, జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంగళగిరి-తాడేపల్లి కమిషనర్లకు విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అవగాహనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ఎంపీడీవో ఎం. రామకృష్ణారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. అంగర శ్రీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో ప్రతిభ మొదటి ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ పీవీ రమణ, వాకా రాజారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వినయ్ ప్రతాప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణములో పలుచోట్ల ట్రాఫిక్ పై తగు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణ లేకుండా టు వీలర్ ఫోర్ వీలర్ పై దృష్టి సారించి, కేటాయించిన స్థలంలోనే పెట్టుకోవాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు భద్రత సూత్రాలు కూడా పాటించాలని లేనియెడల జరిమానా విధించడం జరుగుతుందని వారు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలో ఆటోలు సైతం ఎక్కడపడితే అక్కడ స్టాప్ చేయడం వల్ల ట్రాఫిక్కుకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ట్రాఫిక్ నియమాల పద్ధతులు పై ప్రజలకు చిన్న వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలను యువత వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత వినియోగించుకోవాలి నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు.మండలంలోని నరేంద్రపురం గ్రామంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ని ఎమ్మెల్యే రాజా, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి సంయుక్తంగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 9వ తేదీన నన్నయ్య యూనివర్శిటీలో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ జాబ్ మేళాలో మొత్తం 14 కంపెనీలు పాల్గొంటున్నాయని సుమారు 630 ఉద్యోగ ఆవకాశాలు ఉన్నాయనీ,ఈ అవకశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఈ నంబర్లను 7989656834, 9581810049 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ స్పెషల్ ఆఫీసర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి,డిస్ట్రిక్ట్ మేనేజర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ మల్లాయపాలెం లోని టిడ్కో గృహాల ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలసీల రఘురాం, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ కోటేశ్వరరావు, కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పి పి.జాషువా, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్ని వెంకటరామయ్య, కొడాలి శ్రీవెంకటేశ్వరరావులు ఏర్పాట్లు పరిశీలిం చారు. ఈ పర్యటనలో మంత్రుల వెంట టిడ్కో సిఈ కృష్ణారెడ్డి, ఆర్డీవో పద్మావతి, పివో చిన్నోడు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ఐక్యతతో పనిచేద్దాం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా కలసి కట్టుగా పనిచేద్దామని బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కర్యదర్శి రావులకొల్లు వెంకటనాగమల్లేశ్వరరావు, నియోజవర్గ అధ్యక్షులు దారం నరసింహారావులు పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక అంజనేయ పంక్షన్ హాలులో బిసి సంఘ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావుకొల్లు, దారంలు మాట్లాడుతూ ఇటీవల జరిగిన జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల విగ్రహ అవిష్కరణ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బీసీలు రాజ్యాధికారం సాధించేందుకు ఐక్యతతో ఉండలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కె.యశోదాయామినిదేవి, ఉపాధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, వై, గొవర్ధనరావు, అగస్తి అరివిష్ణు, బి.సోమశేఖర్, ఎం.పద్మ, రాధకృష్ణ, ఎం.వెంకటలక్ష్మీ, ఉద్యోగ సంఘ నాయకలు తదితరులు పాల్నొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామంలో యాదవ బజార్ వద్ద గల గంగానమ్మ గుడి సమీపంలోని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వర్ల కుమార్ రాజా ఆవేదన వ్యక్తం ఆ స్తంభాన్నితొలగించి దాని స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటుకు స్పందన కార్యక్రమంలో అర్జీ దాఖలు చేసినా ఏ విధమైన స్పందన లేదని, అలాగే జగనన్నకి చెబుదాం లో ఫిర్యాదు చేసినా ఉలుకు పలుకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం ప్రమాదభరితంగా ఉన్న ఆ విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి, విలేకరులకు దీనికి సంబంధించిన వివరాలను ప్రకటించారు. గ్రామంలోసంతోషంగా గంగానమ్మ సంబరాలు జరుపుకోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం గురించి అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులుగాని స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా కాపాడాలని కోరారు.

"క్రమబద్ధీకరణ"పై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

విశాలాంధ్ర-కూచిపూడి : 2014 సంవత్సరానికి ఐదు సంవత్సరాలు సర్వీసుఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రకటన పట్ల మొవ్వ మండల పారామెడికల్ సిబ్బంది మంగళవారం హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి అప్పట్లో జరిపిన పాదయాత్రలో బాధలు విని "నే విన్నాను.. నేనున్నాను"అంటూ ఇచ్చిన హామీ నేడు సఫలీకృతం కావడంతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియపరిచారు. మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియపరుస్తున్నామని, త్వరలోనే దీనికి సంబంధించిన జీవోను విడుదల చేయాలని కోరుతూ పారామెడికల్సిబ్బంది కే రామాంజనేయులు, వి నాగరాజు, ఎం శ్యామ్ కుమార్, వి సూర్య ప్రకాశరావు, ఏపీ ఎన్జీవో యూనిట్ వైస్ ప్రెసిడెంట్ బి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి జి సమిత హర్షం ప్రకటించారు.